ఆ తరువాత రూమ్‌లోకి అడుగుపెట్టింది నిశాంత.

నిశాంత అడ్రస్‌తో వచ్చిన ఒక పార్సిల్ టేబుల్ మీదుంది. తీసుకుని ఓపెన్ చేసింది.

ఆడియో కేసెట్!

ఆ కేసెట్‌ని చూడగానే ఎవరి దగ్గర్నించి వచ్చిందో అర్థమయిపోయింది.

దేశ్‌ముఖ్.........

టేప్‌రికార్డర్‌లో పెట్టి ఆన్ చేసింది.

"హలో నిశాంతా! హౌ ఆర్యూ? వారం రోజులుగా నా దగ్గర్నించి మెసేజ్ రాలేదని కంగారుపడుతున్నావ్ కదూ? ఎందుకు పంపలేదో కాసేపు ఆలోచిస్తే నీకే తెలుస్తుంది ఇద్దరూ..... వెన్నెల్లో కెమ్టీఫాల్స్ దగ్గర చాలా సేపు కబుర్లాడుకున్నారు కదూ! సిద్ధార్థను చూడగానే నిజంగానే ప్రేమించేశావనుకున్నాను. ఈ వారం రోజులూ నువ్వు నా మెసేజ్ కోసం ఎదురు చూశావంటే, అతన్ని కలవలేదంటే......నువ్వతన్ని ప్రేమించడంలేదని, నటించావని రూఢి చేసుకున్నాక, నేనీ మెసేజ్ పంపుతున్నాను.

సో.....మిస్ నిశాంతా! దాగుడుమూతల టైం అయిపోయింది.

ఫస్ట్ ఫేజ్......

సిద్ధార్థను డ్రింక్‌కి బానిసగా చెయ్యి. ముహూర్తం........ రేపు రాత్రి ఎనిమిది గంటలు.

అందుకోసం డెహ్రాడూన్ మౌర్య గెస్ట్‌హౌస్ నీ పేరు బుక్‌చేయడం జరిగింది.

ఎనిమిది నుంచి పదిగంటల వరకు మాత్రమే అతని దగ్గర నువ్వుంటావ్. ఆ తరువాత అతనేమవుతాడో నీకనవసరం గుర్తుంచుకో."

సిద్ధార్థతో తను చెప్పిన విషయం గుర్తుకొచ్చింది నిశాంతకు.

రాత్రి పదిగంటలకు కెమ్టీ ఫాల్స్ దగ్గర ఎదురుచూస్తాడేమో!

రేపట్నించి తను సిద్ధార్థను పతనానికి చేరువచేసే యజ్ఞాన్ని ప్రారంభించబోతోంది.

మరి ఈ సమయంలో ఎలా వెళ్ళడం......? ఎలా నవ్వుతూ మాట్లాడటం?

"నువ్వు నన్ను ప్రేమిస్తున్నావా?" అంటే ఎలా చెప్పడం?

అతని మెత్తని హృదయాన్ని తలచుకుని ఎటూ తేల్చుకోలేక బాధ పడింది నిశాంత.

* * * * * * * * * * * *

డెహ్రాడూన్.......

మౌర్య గెస్ట్‌హౌస్..........

రాత్రి ఎనిమిది గంటలైంది.

విశాలమైన గెస్ట్‌హౌస్! వరండాలో రోడ్డు వేపు చూస్తూ పచార్లు చేస్తోంది నిశాంత.

సిద్ధార్థ వస్తాడా? రాడా?

అదే సమయంలో లోనికి నడిచొస్తున్న సిద్ధార్థను చూసి ఆశ్చర్యపోయింది నిశాంత.

"నువ్వు రావనుకున్నాను. వచ్చినా.......కారులో వస్తావనుకున్నాను" అతని దగ్గరగా వెళుతూ అంది నిశాంత.

"మీ రెస్టారెంటుకి వెళ్ళాను. కౌంటర్లోని వ్యక్తి ఓ కవరిచ్చాడు. టాక్సీలో వచ్చాను. అవునూ.....ఏమిటిదంతా? ఎనీథింగ్ స్పెషల్.......?"
నవ్వుతూ అడిగాడతను.

ఏం చెప్పాలో అర్థం కాలేదు నిశాంతకు.

"ఇవాళ నా పుట్టినరోజు! సడన్‌గా సర్‌ప్రైజ్ చేద్దామని" టక్కున అబద్ధం ఆడేసిందామె.

"అమ్మాయిగారికి ఎన్నో పుట్టినరోజో.....?" రూమ్‌లోకి అడుగు పెడుతూ అన్నాడతను.

"ఫస్ట్ బర్త్‌డే......."

"అంటే?"

"నీలాంటి కావలసిన ఫ్రెండ్‌తో కలిసి జరుపుకోవడం......." నిజంగానే నిశాంతగా మారిన లక్ష్మి జీవితంలో యిదే ఫస్ట్ బర్త్‌డే!

తన ఫస్ట్ బర్త్‌డేను ఇంకొకర్ని ట్రాప్ చెయ్యడానికి వుపయోగిస్తున్నందుకు మనసులో బాధగానే వుంది నిశాంతకు.

"నీ పుట్టినరోజని ముందుగా తెలిస్తే నీ కోసం నేనేమైనా తెచ్చేవాడిని కానీ......."అటూ యిటూ చూసి తన మెడలో వున్న గోల్డ్‌చెయిన్‌ని తీసి ఆమె మెడలో వేశాడు సిద్ధార్థ.

ఒక్కక్షణం నివ్వెరపోయింది నిశాంత. నిశ్చేష్టురాలై సిద్ధార్థ కళ్ళలోకి చూస్తూండిపోయింది.

"నిన్ను అమితంగా ప్రేమించే వ్యక్తి, నీ పుట్టినరోజు కానుకగా యిచ్చినగోల్డ్ చెయిన్. నిన్ను అమితంగా ప్రే......" ఆగిపోయాడతను.

"ఏం? సగంలో ఆగిపోయావే?"

అలా అంటున్న నిశాంత కోలకళ్ళవైపు కొంటెగా చూస్తూ, దగ్గరగా వచ్చి నిలబడ్డాడతను.

"నీకిప్పుడు చెప్పలేని కోపం వచ్చిందనుకో! ఏం చేస్తావ్?" అడిగాడతను నవ్వుతూ.

"కోపం ఎందుకొస్తుంది?"

"వస్తే ఏం చేస్తావ్?"

"నేనేం చెయ్యను"

"ఆర్యూ ష్యూర్? ఆ మాట మీదే వుండాలి. ఓ.కె...నీకు కోపం రాదు........"

ఊపిరాందని వేగంగా ముందుకు కదిలి, ఆమె పెదవుల మీద ముద్దు పెట్టుకున్నాడు

ఊహించని చర్యకి నివ్వెరపోయింది నిశాంత!

సరిగ్గా-

అరవై సెకండ్లు........

నిశాంత జీవితంలో అంతులేని మధురిమకు మొట్టమొదటిసారి ఆకృతి కల్పించిన అరవై సెకండ్లు.......

సిద్ధార్థ ఒంటరి జీవితంలో ఆకు మీద పడిన మంచు బందువులా అంతులేని అనుభూతిని రగిల్చిన అరవై సెకండ్లు......

సిగ్గుపడుతూ విడివడింది నిశాంత.

"ఇందుకోసమా నిన్నిక్కడకు పిల్చింది" కోపంగా అంది నిశాంత.

"ఇదిగో అమ్మాయ్! నీకు కోపం రాదని ముందే అన్నావా, లేదా! అతడి మాటకు జవాబివ్వలేకపోయింది నిశాంత.

తొలిముద్దు స్పర్శనుంచి తేరుకోవడానికి కొన్ని క్షణాలు పట్టింది ఆమెకు. వెంటనే తన కర్తవ్యం గుర్తుకొచ్చింది.

దేశ్‌ముఖ్ మెసేజ్ గుర్తుకొచ్చింది. కప్ బోర్డులో వున్న విస్కీ బాటిల్స్ గుర్తుకొచ్చాయి.

అంచెలంచెలుగా అతడిని నాశనం చెయ్యాలి? చెయ్యగలదా తను? అమాయకంగా కన్పించే ఆ ముఖంలో చూస్తూ ఆలోచిస్తోంది ఆమె.

అతడిని ప్రేమిస్తోందా తను?

ఆ ప్రశ్నకు వెంటనే జవాబు దొరకలేదు.

"బర్త్‌డే పార్టీ లేదా" నవ్వుతూ అడుగుతున్న అతడివైపు అయోమయంగా చూసిందామె.

"పార్టీ కోసమే నిన్నిక్కడకు తీసికొచ్చాను. నాకోసం.......నువ్వేమైనా చేస్తావా?" కప్ బోర్డువైపు నడుస్తూ అంది.

"టెస్టింగా? చెప్పు......ఏం చెయ్యమంటావ్?" సీరియస్‌గా అడిగాడు అతను

ఒక్క క్షణం అతని కళ్ళల్లోకి చూసింది నిశాంత.

"ఈ రాత్రంతా.........వంటరిగా........యీ గెస్ట్‌హౌస్‌లో వుండాలి" కప్‌బోర్డులోని విస్కీబాటిల్స్ తీసి గ్లాసు టీపాయ్ మీద పెడుతూ అంది నిశాంత.

"ఎందుకు?" వెంటనే సిద్ధార్థ నోటినుంచి వచ్చిందా ప్రశ్న.

నిశాంత కోసం తను వుండగలడు కానీ.......తను ప్యాలెస్‌లో లేని విషయం బయటపడితే.......సెక్యూరిటీ స్టాఫ్‌కి, అనంతమూర్తికి ఆ విషయం తెలిస్తే ......అతడి వెనక తొంగిచూస్తున కనబడని భయం.

మీద పెడుతూ అడిగింది నిశాంత.

"రాత్రంతా అఖ్ఖర్లేదు నాలుగు, అయిదు గంటలవరకూ" మళ్ళీ చెప్పింది.

గ్లాసు నిండా విస్కీని నింపి, మిగతా బాటిల్స్‌లోని విస్కీని సింక్‌లో పారబోసింది ఆ ఖాళీ బాటిల్స్‌ను గెస్ట్‌హౌస్ వెనక పొదల్లోంచి విసిరేసింది.

"ఏమిటిదంతా? గమ్మత్తుగా వుందే పార్టీ"

మరో అరగంట గడిచింది. చేతి వాచీవైపు చూసింది నిశాంత.

"సరిగ్గా నాలుగు గంటలకు టాక్సీ వస్తుంది. నిన్నెవరూ డిస్టర్బ్ చెయ్యరు సిద్ధార్థ! రేపు కలుద్దాం......గుడ్‌నైట్" చెప్పింది నిశాంత.

"ఏమిటిదంతా.....నువ్వెళ్ళిపోతున్నావా" నిశాంత ప్రతి చర్యా ప్రతి మాటా విచిత్రంగా వుంది అతడికి.

"ఒక్కరోజూ నాకోసం .....బుద్ధిగా ఇక్కడుండు సిద్ధార్థ!"అల్లరిగా అతని ముక్కు మీద గిల్లి గెస్ట్‌హౌస్‌లోంచి బయటకొచ్చింది నిశాంత.

మరో అయిదు నిమిషాల తర్వాత నిశాంత వ్యాన్ ముస్సోరీ రోడ్డు వైపు చీకట్లో ప్రయాణం చేసింది.

అతను అలోచించడం మొదలుపెట్టాడు మొట్టమొదటిసారిగా నిశాంత గురించి ఆలోచించడం మొదలుపెట్టాడు.

"ఎవరీమె?"

విస్కీ గ్లాసుని చూస్తూ ఆలోచిస్తున్నాడు అతను.

* * * * * * * * * * *

ముస్సోరికి ఇరవై ఎనిమిది కిలోమీటర్ల దూరంలో వున్న యమునా బ్రిడ్జి నిశ్శబ్దంగా వుంది.

ఆ బ్రిడ్జి చివర సిమెంట్ అరుగు మీద ఇద్దరు వ్యక్తులు కూర్చున్నారు.

ఆ ఇద్దరూ నిశాంత, సిద్ధార్థ.

"నిశాంతా! ఇంతదూరం నిన్నెందుకు రమ్మన్నానో తెలుసా?"

"ఎందుకు?"

"నువ్వు నవ్వనంటే చెప్తాను"

"చెప్పు"

"నాకు ఏ పనీ చేయాలనిపించడం లేదు. నా మీద నాకే చికాగ్గా వంటోంది. రాత్రిళ్ళు నిద్రపట్టడం లేదు. నేను బ్రతుకుతున్న కృత్రిమ వాతావరణంలోంచి బయటపడి దూరంగా వెళ్ళిపోవాలనుంది స్వేచ్ఛగా బ్రతకాలని వుంది."

నిశాంత.

“స్వేఛగా అంటే?”

“స్వేచ్ఛగా అంటే జాలీగా కాదు. నా జీవితాన్ని నేనే నిర్దేశించుకోవాలి డబ్బు, హోదా, అధికారం ఇవేవీ నాకఖ్ఖర్లేదు. ఎవరి చేతుల్లోనూ బంధీగా కాకుండా నీలా స్వతంత్రంగా.”

“నాలా స్వతంత్రంగానా?” ఆ మాటకు మనసులోనే నవ్వుకుంది నిశాంత.

నేను స్వతంత్రురాలిని కాదు మిత్రమా! నేను కూడా బంధీనే. నువ్వు కనీసం నీ గురించి అలోచించుకునే స్వేచ్ఛ వుంది నాకా స్వేచ్ఛకూడా లేదు. నా ఆలోచనలు కూడా నావి కావు. నాబ్రతుకు నాది కాదు. ఆమె మనసు నిశ్శబ్దంగా ఒక్క క్షణం బాధపడింది.

“ఏం చెయ్యాలని” తేరుకుంటూ అడిగింది.

“ఎక్కడికైనా వెళ్ళిపోతాను.........దూరంగా. అందుకు నాక్కాల్సింది.....నన్ను ఇన్‌స్పైర్ చేసే ఒక మనసు” నిశాంత కనుగుడ్లలో కనిపిస్తున్న తన ప్రతిబింబంవైపు చూస్తున్నాడు అతను.

తన మనసులో మారుమూల గూడు కట్టుకుని వున్న గాఢమైన అనుభూతులకు అక్షర రూపకల్పన చేస్తున్నాడు అతను.

“నేను అదృష్టవంతుడ్నో, దురదృష్టవంతుడ్నో నాకే తెలీడం లేదు నిశాంతా! నా బ్రతుకు గురించి నీకు తెలీదు, బంగారు పంజరంలో చిలకను నేను నేను నేర్చుకొన్న చిలుకపలుకులు......బిజినెస్.......బిజినెస్.....అంటే.....అసలు నేనెవరో నీకు తెలుసా?” ఆవేశంగా అడిగాడు అతను.

“అందమైన, అమాయకమైన మనుషుల్ని ప్రేమించగలిగే సిద్ధార్థవు కాదా?” అతని చేతిని తన చేతిలోకి తీసుకుంటూ అంది నిశాంత

“మనుషుల్ని ప్రేమించగలిగే సిద్ధార్థ.....అవును.......నిశాంతా! నాకు మనుషుల మధ్య ఒక మనిషిగా తిరగాలని వుంది. నాకు ఆత్మీయత కావాలి. నాకు ప్రేమ కావాలి. చెప్పు నిశాంతా? వాటిని నాకివ్వగలవా?”

నీరెండలో కలగలిసిన యమునానది మీదనుంచి వస్తున్న గాలి వెచ్చగా తగిలింది ఆమెకు.

“ఏంటాలోచిస్తున్నావ్ నిశాంతా? నేను నీ ప్రేమకు అర్హుడ్ని కానా? చెప్పు? నీ ప్రేమను నేను పొందాలంటే నను ప్రేమించాలంటే ఏం చెయ్యాలో చెప్పు?”

జాలిగా నవ్వింది ఆమె. తన జాలి తనకే అంతులేని ఆగాథంలా కనిపిస్తోంది ఆ ఆగాధం చివర దేశ్‌ముఖ్. ఆయన చేతిలో ఆయుధం తను.

నిన్ను నాశనం చెయ్యడానికి వచ్చిన విషపు ఆయుధాన్ని నేను. నేను నీ వ్య క్తిత్వాన్ని చంపడానికి వచ్చిన మృత్యువును. మృత్యువును నువ్వు ప్రేమిస్తున్నావ్ సిద్ధార్థా..........

అతని చేతి స్పర్శతో చటుక్కున నిశాంత ఆలోచనలు తెగిపోయాయి.

అతని చెయ్యి నెమ్మదిగా ఆమె నడుముని చుట్టుముట్టింది.

ఆమెను గట్టిగా పట్టుకుని ఆమె ముఖాన్ని తనవైపు తిప్పుకుని ముందుకు వంగి కంఠం మధ్య భాగంలో, నుదుటిమీద, కనురెప్పలమీద ముద్దుపెట్టుకున్నాడు అతను.

అతని స్పర్శ కన్నా ఆ స్పర్శలోని అర్థ్రతకు చలించిపోతోంది అమె. వాళ్ళిద్దరే నిశ్శబ్ద ప్రపంచాన్ని శాసించడానికి సిద్ధమైన వీరుల్లా క్షణాలు.....మంత్రముగ్ధంగా మెల్లగా కదులుతున్నాయి.

"నిశా! ఐ లవ్ యూ.......ఐ కాంట్ లివ్ విత్ అవుట్ యూ........" అతని గొంతులోని మెల్లని మాటలు, ఆమె చెవి కుహరంలో అలల్లాసుడులు తిరుగుతున్నాయి.

భారంగా కళ్లు మూస్తుకుంది ఆమె

* * * * * * * * *

"హలో" ఆ పిలుపుకి చటుక్కన కళ్ళిప్పిన నిశాంత ఎదురుగా కన్పించిన ముగ్గురు వ్యక్తుల్ని చూసి భయపడి అతడి కౌగలినుంచి చటుక్కన విడవడింది.

రోడ్డుకు రెండోవేపున ఓ జీపు ......అందులో ముగ్గురు కుర్రాళ్లు సీటులోంచి దిగి, వెకిలిగా నవ్వుతూ ముందుకొస్తున్నాడు ఒకడు దృఢంగా కండలుదీరిన శరీరం.

సిద్ధార్థ వేపు భయం భయంగా చూసింది నిశాంత.

"పిట పిట లాడుతున్న పిట్టను పట్టావ్ గురూ! శ్రమ లేకుండా నుంచి స్పాటుకి తీసికొచ్చావ్. థాంక్స్ గురూ! రేపుదయం యిక్కడికే రా నీ పిట్టను నీకిచ్చేస్తాం" ఆ యువకుడు గబుక్కున నిశాంత చేతిని పట్టుకుని లాగాడు

ఆ విసురుకు నిశాంత ముందుకి పడబోయి నిలదొక్కుకుంది.

"బాస్టర్డ్!" అరుస్తూ పరుగెత్తబోయిన నిశాంతను జీపులోని ఇద్దరూ యువకులూ చెరో రెక్కా పట్టుకుని జీపులోకి ఎక్కించడానికి ప్రయత్నిస్తున్నారు.

సిద్ధార్థ పరుగు ముందుకొచ్చాడు. మొదటి యువకుడు గుండెల మీద చెయ్యి వేసి తోసేశాడు. ఆ వూపుకు అతను నేలమీద పడిపోయాడు.

కానీ వాళ్ళకు అతను మార్షల్ అర్ట్స్‌లో ఎంత శిక్షణ తీసుకుంది నిశాంతకు కూడా తెలీదు

"సిద్ధా...... ర్థా......." భయంగా అరిచింది నిశాంత. బలమైన వాళ్ళ చేతుల్నించి తప్పించుకోవడానికి తీవ్రంగా ప్రయత్నిస్తోంది.

మొదటి యువకుడు పరుగు వచ్చి జీపు స్టార్టు చేశాడు.

జీపు ముందుకి కదిలింది

"సిద్ధార్థా......సిద్ధర్థా!" అరుస్తోంది నిశాంత. వాళ్ళ ముగ్గురుతో తను తలపడలేదు

వుండిపోవడం గుర్తుకొచ్చి గిజగిజలాడిపోయింది. అప్రయత్నంగా ఆమె కళ్ళవెంబడి కన్నీళ్ళుబికాయి

నిశాంత అరుస్తోంది......

వంతెన మీదుగా జీపు పరుగులంకించుకుంది.

కిందపడిన సిద్ధార్థ లేచి చిరుతలా కారు వేపు కదిలాడు

“ఎవడు వాడు? కాబోయే మొగుడా.......పోనీలే మా గెస్ట్‌హౌస్‌లో చిన్న పనుంది.... అదైపోయాక వదిలేస్తాం......డోన్ట్‌వర్రీ” జోకులేస్తూ వికటంగా నవ్వుకుంటున్నారు వాళ్లు.

అప్పటికి వంతెనగానీ, సిద్ధార్థగానీ కనిపించడంలేదు.

జీపు ముస్సోరీ దారిలో వుంది. నేషనల్ హైవే రెండుగా చీలే ప్రదేశం దగ్గరకొచ్చింది జీపు.

ఒక దారి డెహ్రాడూన్ వేపు వెళుతుంది.

డ్రైవింగ్ సీట్లో కూర్చున్న ఆ యువకుడ్ని దృష్టిలో రోడ్డుపక్కన మారుతీ కారు, ఆ కారు పక్కన ఠీవిగా నిలబడ్డ సిద్ధార్థ మీద పడి ఉలిక్కిపడ్డాడు.

అతని చేతిలో పిస్టల్......సూటిగాన జీపు టైర్లను గురిపెడుతూ.......

అతను ట్రిగ్గర్ నొక్కడం........వాయువేగంతో ఆ బుల్లెట్లు జీపు పడడం ....... అంతా క్షణాల్లో జరిగిపోయింది.

కిందపడిన నిశాంత పైకి లేచి అతని వైపు పరుగుతీసింది అదే సమయంలో ఓ యువకుడు ఆమె వేపు పరుగెత్తి ఆమె చీరను పట్టుకుని గుంజబోయాడు.

మరే మాత్రం ఆలస్యం చేయలేదతను పెనువేగంతో గాలిలోకి ఎగిరి ఆ యువకుడి మీ పడ్డాడు ఆవిసురుకి ఆ యువకుడు గాలిలోకి బంతిలా లేచాడు లేస్తూనే అతని నిజమైన బలాన్ని అంచనా వేసుకొని భయపడిపోయాడు. క్రిందపడ్డ అతన్ని మరోసారి తన్నాడు

అతను దబ్బున కిందపడ్డాడు నడుం కలుక్కుమంది.

ఆ యువకుడు వేపు నడుస్తున్నాడతను. అతని కళ్ళు ఎర్రగామండుతున్న అగ్నిగోళాల్లావున్నాయి. బలంగా బిగుసుకున్న అతని పిడికిలి ఇనుప ముక్కలా వుంది. అప్పటికే మిగతావాళ్ళు అతని బలాన్ని చూసి షాక్ తిన్నారు.

“గెటప్!” అరిచాడతను. అలా అరుస్తున్న అతని వేపు కొత్త మనిషిని చూస్తున్నట్టుగా చూస్తోంది నిశాంత. సుకుమారమైన అతనిలో మొట్టమొదటిసారి మగవాడ్ని చూస్తోందామె.

అతను వాడి కుడిచెయ్యి పట్టుకుని ముందుకి లాగి ఒక్కసారి ఆ చేతిని వెనక్కి తిప్పాడు భుజం దగ్గర ఎముక కళుక్ మన్న చప్పుడు బాధతో పెనుకేక వేశాడు ఆ యువకుడు.

అదే సమయంలో మిగతా ఇద్దరు యువకులు మీద పడ్డారు.

ఒకడ్ని మోకాలితో పొట్టలో తన్ని రెండోవాడి జుత్తు పట్టుకుని విసురుగా ముందుకి

తోశాడు

వాడు ముందుకెళ్ళి జీపుకి గుద్దుకుని నిస్సహాయంగా అరుస్తూ కిందపడి పోయాడు. ఆపైన లేచే ప్రయత్నం చేయలేదు ఆ ముగ్గురూ.

అతను జీపెక్కి స్టార్ట్ చేశాడు.

గేరు మార్చి స్పీడుని పెంచాడు.  వాళ్ళు భయంతో లేచి పరిగెత్తనారంభించారు.

వార్ని జీపుతో వెంటాడాడతను.

ముగ్గురూ మూడువేపులకు పారిపోయారు.

“బాస్టర్డ్స్......” జీపులోంచి దిగుతున్న అతని వేపు ఆశ్చర్యంగా చూస్తోంది నిశాంత.

ముందుకొచ్చి మళ్ళీ వెనక్కి నడిచి సీటుమీదున్న అగ్గిపెట్టెను తీసుకొని అందులోంచి అగ్గిపుల్లను తీసి వెలిగించి ఆయిల్ టాంకర్ వేపు విసిరాడు.

నెమ్మదిగా.......నెమ్మదిగా మంటలు రాజుకుంటున్నాయి.

“కమాన్ నిశా!” కారెక్కుతూ అన్నాడతను.

మరో రెండు నిమిషాల్లో కారు అక్కడనుంచి బయలుదేరింది.

ఇరవై అడుగుల దూరం వెళ్ళాక విండో మిర్రర్‌లోంచి వెనక్కి చూశాడు.

మండుతున్న జీపు బాంబులా పేలిపోయింది.

చుట్టూ పొగ.........జీపు ఇనపముక్కలు.

“వాళ్ళ బారినుండి నేను బయటపడతానని అనుకోలేదు” హాయిగా ఊపిరిపీల్చుకుంటూ అంది నిశాంత.

“అంటే?” కోపంగా ప్రశ్నించాడతను

“వాళ్ళు రౌడీలు......ఎంతకైనా తెగిస్తారు” అతనిలో అంత బలాన్ని ఊహించలేదామె.

అతని చూపులు ఆమె మీదే వున్నాయి.

అంత సూటిగా తనవేపే  ఎందుకు చూస్తున్నాడో అర్థంకాలేదు అమెకు.

రెస్టారెంటుకు కొంచెం దూరంలో ఆగింది కారు.   కిందకు దిగింది నిశాంత.

“నా ప్రశ్నకు జవాబెప్పుడు చెప్తావ్?”

ఒక్క క్షణం తటపటాయించింది నిశాంత.

“నువ్వు మామూలు ప్రేమికుడివా? గొప్ప ప్రేమికుడివా?”

“అంటే?”

“ప్రేమ ప్రేమనే కోరుతుంది”

“నేనడిగింది సూక్తులు కావు........ఇలాంటి సూక్తులు నేనూ చాలా చెప్తాను” చిరుకోపాన్ని నటించాడతను.

ముందుకెళ్ళిపోయిందామె.

ఆశ్చర్యంగా చూస్తూ కారు స్టార్ట్ చేశాడతను. కానీ వాళ్ళిద్దరకు తెలీదు- ఆ ముగ్గురూ దేశ్‌ముఖ్ పంపగా వచ్చిన మనుష్యులని.

* * * * * * * * *

బోయ్ ఒక కవరుని తెచ్చి టేబుల్ మీద పెట్టి వెళ్ళిపోయాడు.

బ్లూ కలర్ కవరు. కార్నర్స్ జాగ్రత్తగా సిజర్‌తో కత్తిరించింది. కలర్‌ఫోటోలు!

ఆ ఫోటోల్ని చూడగానే అవి ఎక్కడ నుంచి వచ్చాయో, ఎవరు పంపారో అర్థమైపోయింది నిశాంతకు.

గంగిరెడ్డి పల్లి పోటోలవి! నీళ్లు చిమ్ముతున్న రెండు బోరింగ్ పంపులు........

సగం లేచిన శివాలయం గోడ......పాతిపెట్టిన విద్యుత్ స్థంభాలు..........

ఒక్క క్షణం ఆనందంతో ఆమె మనసు వుప్పొంగిపోయింది.

అదే సమయంలో-

టెలీఫోన్ మోగింది. వెంటనే అందుకుందామె.

దేశ్‌ముఖ్!

"చూశావా ఫోటోలు?"

"చూశాను......సార్.......మా ఊరు బాగుపడుతున్నందుకు నాకు చాలా అనందంగా వుంది" అంది నిశాంత.

"బట్.....అయామ్ నాట్ హేపీ! ఎందుకో తెలుసా? డెహ్రాడూన్ గెస్ట్‌హౌస్‌లో ఖాళీ విస్కీ సీసాలు నా దగ్గరున్నాయి.

"ఖాళీ విస్కీ సీసాలా?........" ఆమె గొంతు తడారిపోయింది.

"నిశాంతా! నీది ప్రేమించే వయసని నాకు తెలుసు సిద్ధార్థలాంటి మగాడు నీలాంటివాళ్ళకు దొరకడని కూడా నాకు తెలుసు. నీకు ప్రేమే కావలనుకో........నేనేం అభ్యంతరం పెట్టను. ఈ క్షణం నుంచి మరిచిపోతాను. మరుక్షణంలో నువ్వు రెడ్‌లైట్ ఏరియాలో వుంటావు. అప్పుడు సిద్ధార్థనీ

వెంటే వుంటాడనుకుంటున్నావా?" దేశ్‌ముఖ్ గొంతులోని కోపానికి వణికిపోయింది నిశాంత.

"అది కాదు సర్!"